కథ కాని 'కథ'



# ఎవరికెరుక?

గుడిపూడి సుబ్బారావు

ఓరోజు నైజాం నవాబు పట్నం నుండి బయలుదేరి నాయకన గూడెం ఈ మూల నిలబడి ఆ మూల పాలేరు వైపుకు పారజూశాడు. తిరిగి ఆ పక్కకుపోయి ఈ పక్కకు పారజూశాడు. అలా పారచూడ్డం అయ్యాక ఈ పొలుగ చెరువు కట్ట నిర్మాణం చేయమని తన ఉద్యోగస్థులను పురమాయించాడు.

మరి డబ్బు కావాలి కదా! పట్నం వెళ్లిపోయాక, పట్నం నడిబొడ్డున 'నౌబత్ పహాడ్' ఎక్కాడు. అక్కడ వున్న నగారాను మోగించాడు. పట్నంలో వున్న ముఖ్యులందరూ, అంటే పెద్ద పెద్ద హోదేదార్లూ, జాగిర్దార్లూ, దేశ్‌ముఖులు, అలాగే వ్యాపారస్థులూ, సంపన్నులూ అందరూ తరలి వచ్చారు. అలా రావడం ఆనవాయితీ, రివాజున్నూ! రాజుగారు ఏం చెప్తారోనని, ఏం సెలవిస్తారోనని ఆసక్తిగా వున్నారు కూడా! మొత్తం మీద వెనుకా ముందుగా అందరూ వచ్చారు. ఎవరికి వీలైన చోట వారు కూర్చున్నారు.

ఇంతలో నవాబుగారు వచ్చి ఎత్తైన సింహాసనంలో కూర్చున్నారు.

పురప్రముఖులను పేరుపేరునా పిలిచి అల్లాకు మన రాజ్యంమీద కోపం వచ్చింది. అందుకని ఎన్నడూ లేనంత కరువు వచ్చింది. వాన చుక్కలేదు. కరువుకు తట్టుకోలేక పేదజనం తమ పిల్లలను, పదికీ, పాతిక్కీ అమ్ముకుంటున్నారని గూడా తెలుస్తున్నది. భగవంతుని దయవల్ల ఎక్కడైనా వాన కురిస్తే... ఆ నీరంతా వృధాగా వెళ్లిపోతున్నది. నేను నిన్న దొరా వెళ్లి చూసి వచ్చాను. నాయకనగూడెం నుండి సైతికాని గూడెం వరకు మనం పెద్ద కట్ట పోయించినట్లైతే అక్కడో పెద్ద చెరువు తయారవుతుంది. కురిసిన వానచుక్క అక్కడే నిలిచిపోతుంది. రైతులు పొలాలు చేసుకుని కరువును తమ కష్టంతో పారదోల్తారు. 'మీరందరూ సంపన్నులు. మీ డబ్బు వడ్డీతో తిరిగి యిస్తాను. మీరెన్ని వందల రూపాయలు యివ్వగలిగితే, అన్ని దెబ్బలు ఈ నౌబత్ మీద కొట్టమని విన్నవం చేశాడు.

'వడ్డీతో యిస్తానంటున్నాడు. మన దగ్గర వూరికే వుండి మటుకేం చేస్తుందీ డబ్బు' అనుకుని, ఒక్కొక్కరూ లేచి తావు యివ్వదలుచుకున్న డబ్బుకొద్దీ నగారామీద దెబ్బలు కొట్టారు. ఒకటి, రెండు, మూడు యిలా దెబ్బలు పడిపోతున్నాయి నగారా మీద! ఎవరెన్ని దెబ్బలు కొడితే వారన్నివందల రూపాయలు యివ్వడానికి సిద్ధమయ్యారన్నమాట.

అలా, అందరూ వారి వారి శక్తికొద్దీ నగారా మోగించారు. వెంటనే, అక్కడ డబ్బు కూడా రాశి పోస్తున్నారు. ఆఖరుకి ఓ తండ్రిలేని పిల్లాడు లేచాడు. 'అమ్మా! మరి నేనెన్ని దెబ్బలు వెయ్యనే' అని అడిగాడు. ఆ పిల్లవాడి తల్లి 'కొడకా! నీరెండు చేతులు తీపి తీసిందాకా కొట్టుపో' అన్ని డబ్బులు నేనిస్తానంది.

ఆ కొడుకు లేచాడు. తన రెండు చేతులు మార్చి మార్చి నగారా మీద ఇయ్యర్ మొయ్యర్ బాది, బాదీ విసిగి వేసారి సొక్కి సోలిపోయి కూర్చున్నాడు.

కొడుకు నగారామీద ఎన్ని దెబ్బలు మోగించాడో పేష్కార్లు ఆ గొల్లామెకు లెక్క వినిపించారు. విన్న గొల్లామె 'బస్తా' రూపాయలు అక్కడ రాశి పోసింది.

అలా పోగైన డబ్బుతో పాలేరు రిజర్వాయరు పని పూర్తయిపోయింది.

ఓరోజు ఆ గొల్లామె చెరువును చూసొద్దామని హైదరాబాద్ నుండి బయలుదేరి నాయకనగూడెం చేరింది. వచ్చి అలా ఆ చెరువువైపు పార చూసింది. చూసి, ఓసోస్! ఇదెంత పెద్ద చెరువో అనుకున్న! నా బర్ల మడుగు అంతలేదని అనుకుని, తిరిగి పట్నం వెళ్లిపోయిందట.

ముక్తాయింపు: ఆ రోజుల్లో పాతిక లక్షలతో మొత్తం పాలేరు రిజర్వాయర్ నిర్మాణమే పూర్తయింది. అది ధర్మకాలం. అయితే గత సంవత్సరం అదే పాలేరు రిజర్వాయర్ కట్టను వెడల్పు చేసి, షోకులు చేశారు. పదికోట్లు ఖర్చయింది. ఎక్కడ పాతికలక్షలు, ఎక్కడ పదికోట్లు? ఎవరెంత మింగారో ఎవరికెరుక! ■